క్లుప్తంగా

1 నుంచి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌పై ప్రచారం

అమలాపురం టౌన్: డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ కాంపైన్‌ను నవంబర్ 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు అమలాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ తెలిపారు. భారత తపాలా శాఖ ఇండియా పోస్ట్ బ్యాంక్ విధానం ద్వారా కేంద్ర ప్రభుత్వ, అనుబంధ సంస్థల పెన్షన్‌దారులు నవంబర్, డిసెంబర్ నెలలకు సమర్పించవలసిన లైఫ్ సర్టిఫికెట్లు ఇళ్ల వద్దకు వచ్చే పోస్ట్‌మేన్లకు సమర్పించాలని సూచించారు. పెన్షన్‌దారులు పీపీవో (పెన్షన్ పే ఆర్డర్), ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా వివరాలు, మొబైల్ నంబర్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సేవలను కేవలం రూ.70కు అందిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని అమలాపురం, రాజోలు హెడ్ పోస్ట్ ఆఫీసులు, జిల్లాలోని అన్ని పోస్ట్ ఆఫీసుల పరిధిలో ఉన్న పెన్షన్‌దారులు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని విలసవిల్లి, భీమనపల్లి, నంగవరం గ్రామాల్లో నిర్మించనున్న సీసీ రోడ్లకు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు జిన్నూరి వెంకటేశ్వరరావు, సలాది ఊర్మిళాదేవి, ఎంపీటీసీ సభ్యులు దేశంశెట్టి నాగరత్నకుమారి, సలాది సురేఖరాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై న్యాయకార్యదర్శికి వినతి



న్యాయశాఖ కార్యదర్శి సత్యమూర్తికి సమస్యను వివరిస్తున్న నాయకులు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో దళితవర్గాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం అంబేడ్కర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు, సివిల్ రైట్స్ సొసైటీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి పుదుచ్చేరి న్యాయశాఖ కార్యదర్శి సత్యమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ సొసైటీకి సంబంధించి పందుల్లంక భూములపై న్యాయపోరాటం, నష్టపరిహారం తదితర అంశాల గూర్చి వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన న్యాయశాఖ కార్యదర్శి సత్యమూర్తి సొసైటీ సమస్యను పుదుచ్చేరి కోఆపరేటివ్ ఆఫీసర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు దళితనాయకులు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలెం సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం షాపులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. షాపులో రూ.45 వేల నగదు, రూ. 27 వేల విలువ చేసే మద్యం సీసాలను దొంగలు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం షాపు తీయడానికి వచ్చిన షాపు నిర్వాహకులు చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలను సేకరించింది. అల్లవరం ఎస్‌ఐ హరీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా రాఘవ



యెండూరి రాఘవ

అమలాపురం టౌన్: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా పట్టణానికి చెందిన యెండూరి రాఘవ ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన వాసవీ క్లబ్ జరిగిన కార్యక్రమంలో రాఘవ చేత క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవి చంద్రన్ ప్రమాణ స్వీకారంచేయించారు. రాఘవ ఆర్యవైశ్య మహిళా నేతగా 12 ఏళ్లుగా వాసవీ క్లబ్‌లోనే కాకుండా ఆర్య వైశ్య మహా సభలో పలు పదవులు నిర్వహిస్తూవస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ రాష్ట్ర కార్యదర్శిగా, అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తగా పలు వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం ఈమె యెండూరి రాఘవ నాగేశ్వరరావు ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌ను స్థాపించి నేత్ర, రక్తదానాలనుప్రోత్సహిస్తున్నారు.

గంగాధర్ ప్రతాప్‌కు ఘన నివాళి

యానాం: ప్రజానాయకుడు, దళిత, బడుగుబలహీన వర్గాల నేత దివంగత గొల్లపల్లి గంగాధర్ ప్రతాప్‌కు పలువురు నేతలు ఘనంగా నివాళులర్పించారు. గంగాధర్ ప్రతాప్ వర్ధంతి సందర్భంగా స్థానిక చిన్నాసెంటర్‌లో గొల్లపల్లి అభిమానులు, నాయకులు బుధవారం చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి గంగాధర్ ప్రతాప్ చేసిన సేవలు ఎనలేనివన్నారు.మండపాక సత్తిబాబు, తిక్కిరెడ్డి సత్యానందం, పండు సిద్ధార్థకుమార్, మల్లిపూడి గంగాధర్, బలభద్రుని వాసు, కర్నీడి మధు, కాకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. అన్నదాతలకు శాపం

- కాలువను కుదించి కాంక్రీటు నిర్మాణం
- సాగునీరందక రైతుల అవస్థలు
- పునర్నిర్మించాలని డిమాండ్



చొల్లంగిలో కుదించి నిర్మించిన పంటకాలువ



సాగునీరు అందక బీడు వారిన శివారు భూములు

తాళ్లరేవు: అధికారుల నిర్లక్ష్యం, పలువురు నాయకుల అనాలోచిత నిర్ణయం రైతుల పాలిట శాపంగా మారింది. మండలంలోని చొల్లంగి వ్యవసాయ భూములకు నిరంతరం సాగునీరందిస్తూ నిక్షేపంలా ఉన్న పంటకాలువను పూడ్చివేసి కాంక్రీటు నిర్మాణం చేపట్టి రైతులను అష్టకష్టాల పాల్జేశారు. ప్రతి ఏటా సీజన్‌లో ఆయకట్టులోని శివారు భూములకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాజులూరు మండల పరిధిలోని గొర్రిపూడి చానల్ నుంచి తాళ్లరేవు మండలం చొల్లంగి పంచాయతీలో సుమారు 250 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందేది. అయితే పంట కాలువల అభివృద్ధి పేరుతో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సొమ్ముల కోసం కక్కుర్తిపడి ఆదరాబాదరాగ కాలువకు ఇరువైపులా కాంక్రీటు నిర్మాణం చేశారు. సుమారు 9 అడుగుల మేర ఉన్న కాలువను నాలుగు అడుగులకు కుదించారు. దీని వల్ల సాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా కాకపోవడంతో వరిచేలు ఎండిపోతున్నాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కాజులూరు మండల పరిధిలోని కొంతమంది రైతులు ఈ చానల్‌నుంచి నీటిని ఆక్వాసాగుకు వినియోగిస్తుండడంతో శివారు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడంలేదని వారు తెలిపారు. దీంతో శివారు భూముల రైతులు వ్యవసాయానికి దూరమై కూలిపనులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చొల్లంగి ఎత్తిపోతల పథకం ద్వారా చొల్లంగి, చొల్లంగి పేట పంచాయతీలతో పాటు కాజులూరి మండలం అడివిపూడి, గొర్రిపూడి గ్రామాలకు చెందిన సుమారు 450 ఎకరాలకు సాగునీరు అందేదని, అయితే రిటైనింగ్ వాల్స్ నిర్మించడం ద్వారా శివారు భూములకు నీరు రాకపోవడంతో వరిచేలు బీడు వారుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి పంట కాలువను వెడల్పు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

నిర్మాణం చేపట్టి... నీరు అందకుండా చేశారు



నిక్షేపంలా ఉన్న పంట కాలువను పూడ్చివేసి కాంక్రీటు నిర్మాణాన్ని చేపట్టి సాగునీటి కష్టాలను తెచ్చిపెట్టారు. గతంలో సాగునీరు పూర్తిస్థాయిలో అందడంతో పంటలు బాగా పండేవి. అయితే కాంక్రీటు నిర్మాణం జరిగిన తరువాత సాగునీరు అందడం లేదు. శివారు భూముల రైతులైతే భూములను బీడుగా వదిలివేశారు.

– నిమ్మగడ్డ శ్రీను, రైతు, చొల్లంగి.

పంట కాలువను పునర్నిర్మించాలి



విశాలంగా ఉన్న పంట కాలువను కుదించడంతో శివారు ప్రాంతాలకు నీరందడం లేదు. దీంతో వ్యవసాయం చేయలేక రైతులు కూలిపనులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇకనైన ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టిసారించి పంట కాలువను గతంలో మాదిరిగా విశాలంగా నిర్మించి, పూర్తిస్థాయిలో సాగునీటిని సరఫరా చేయాలి.

– స్వర్ణ రాజు, రైతు, చొల్లంగి.

కార్యదర్శులకు సత్కారం



బదిలీపై వెళ్లిన కార్యదర్శులను సత్కరిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: అంకితభావంతో సేవలు అందించిన ఉద్యోగులను ప్రజలెప్పుడూ ఆదరిస్తారని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులు కె.వి.వి.సత్యనారాయణ, పిల్లి శ్రీనివాస్, శ్రీరామచంద్రమూర్తిలను అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కృష్ణమోహన్ ఆధ్వర్యంలోఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, అధికారులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏవో లక్ష్మణరావు, ఈవోపీఆర్‌డీ నాగేంద్ర, కార్యదర్శులు దుర్గా శ్రీనివాస్, చిక్కం శ్రీను, రాజమోహన్, మృధుల, వీరబాబు, రవిరాజు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న మహిళ అరెస్టు

ఐ పోలవరం: కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న మహిళను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. యానాం నుంచి యాక్టివా స్కూటర్‌పై మద్యాన్ని తరలిస్తుండగా స్థానిక ఎదుర్లంక చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేశారు. పెదమడి గ్రామానికి చెందిన నిందితురాలి నుంచి 30 మద్యం బాటిళ్లు, స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు.

కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: కూటమి ప్రభుత్వం దళితులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడుతూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో అల్లవరంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ని అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టారని, రెండు సార్లు మంత్రిగా, ఎమ్మెల్యేగా పదవులు అనుభవించి, మచ్చలేని రాజకీయ నాయకుడు పినిపే విశ్వరూప్ కుటుంబాన్ని రాజకీయంగా అణగదొక్కేందుకు ఆయన కుమారుడు శ్రీకాంత్‌పై హత్యానేరం మోపి అరెస్టు చేశారన్నారు. 2021లో వలంటీర్ జనుపెల్ల దుర్గా ప్రసాద్ హత్యకు గురైతే, ఆ కేసుని విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్‌పై మోపడం కక్ష సాధింపు చర్యే అని చెప్పారు. కేసుని విత్‌డ్రా చేసుకుంటే రెండు ఎకరాల పొలం ఇస్తామని దుర్గాప్రసాద్ భార్యకు విశ్వరూప్ ఆశచూపారని మంత్రి సుభాష్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విశ్వరూప్ ఎప్పుడూ తన ఇంటికి రాలేదని, ఆ ఆరోపణల్లో ఎంత మాత్రం నిజం లేదని మృతుడు దుర్గా ప్రసాద్ భార్య మీడియాకు తెలిపిందని ఇజ్రాయిల్ చెప్పారు. దళితులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు ఆపకపోతే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజు వస్తుందన్నారు. ఈ కేసులో శ్రీకాంత్ కడిగిన ముత్యంలా నిర్దోషి బయటకు వస్తారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కూటమి నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఊరూరా బెల్ట్ షాపు ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ సాధనాల వెంకటరావు, బీసీ సెల్ అధ్యక్షులు యల్లమిల్లి బోసు, పార్టీ నాయకులు తిక్కా ప్రసాద్, చింతా రామకృష్ణ, నాతి శ్రీనివాసరావు, పులుసుగంటి గంగాధర్, తుట్టెపు బాబీ, కొనుకు మహేష్, బొంతు సత్యనారాయణ, గోసంగి వెంకటేశ్వరరావు, రాజేష్, విక్రమ్, బాబురావు, మునేశ్వరరావు, పోతుమూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో మెప్మా బజార్



మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ రాజు

అమలాపురం టౌన్: పట్టణంలోని స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో స్థానిక గడియారం స్తంభం సెంటరులో మెప్మా బజార్ ఏర్పాటు చేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ బజార్‌లో బుధ, గురువారాల్లో విక్రయాలు జరుగుతాయి. ఈ బజార్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు ప్రారంభించారు. మహిళలు తయారు చేసిన పలు ఉత్పత్తులను కొద్ది పాటి లాభాలతో తక్కువ ధరలతో ఆ బజార్‌లో విక్రయానికి ఉంచారు. రెండు రోజుల్లో ఈ బజార్ ద్వారా రూ.రెండు లక్షల టర్నోవర్ జరగనుందని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ హుస్సేన్ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌తోపాటు పలువురు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు మెప్మా బజార్‌లో పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు. తిను బండారాలు, పలు రకాల పచ్చళ్లు, వస్త్రాలు, డ్రై ఫ్రూట్స్, బూత్ రూమ్, మరుగుదొడ్లలో వాడే పలు రకాల రసాయన ద్రవాల సీసాలు ఇలా మహిళలు ఇళ్ల వద్ద సొంతంగా తయారు చేసిన వస్తువులను మెప్మా బజార్‌లో విక్రయానికి ఉంచారు. బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలతో మహిళల జీవనోపాధి కోసం కుటీర పరిశ్రమల ద్వారా తయారు చేసిన ఉత్పత్తులను అందరూ కొనుగోలు చేసి, వారిని ఆర్థికంగా ప్రోత్సహించాలని చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ రాజు సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా జిల్లా కార్యాలయం ప్రతినిధి సీహెచ్.శ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, 30 వార్డుల రీసోర్స్ పర్సన్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామ సభలతో భూ సమస్యల పరిష్కారం

తాళ్లరేవు: ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాళ్లరేవు తహసీల్దార్ పితాని త్రినాథరావు తెలిపారు. బుధవారం చొల్లంగి పంచాయతీలో తహసీల్దార్ త్రినాథరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గతంలో నిర్వహించిన రీసర్వేలో ఏవైనా పొరపాట్లు జరిగితే సరిదిద్దుకునే అవకాశం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. స్థానిక నాయకులు బూరెల వెంకటరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్వహించిన రీసర్వేలో చాలావరకు సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ టి.సూరిబాబు, ఆర్‌ఐ జి.రామకృష్ణ, మండల సర్వేయర్ ఎండీ షఫీవుల్లా, పంచాయతీ కార్యదర్శి పోతాబత్తుల శ్రీనివాసరావు, మందాల గంగ సూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులునాయకులు కాపవరపు శ్రీదేవి, స్వర్ణ రాజు పలు సచివాలయాల సర్వేయర్‌లు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు ఎన్‌ఎంఆర్‌ల ఆందోళన



పీడబ్ల్యూడీ ఆఫీసులో ఆందోళన చేస్తున్న ఎన్‌ఎంఆర్‌లు

యానాం: యానాం పబ్లిక్ వర్క్స్ శాఖలో పనిచేస్తున్న ఎన్‌ఎంఆర్‌లు స్థానిక పీడబ్ల్యూడీ ఆఫీస్‌లో బుధవారం ఆందోళనచేశారు. పుదుచ్చేరి రాష్ట్ర సంఘం పిలుపు మేరకు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ప్రస్తుతం ఇస్తున్న నెలవారీ జీతం రూ.10వేలను రూ.18వేలకు పెంచుతున్నట్టు రెండేళ్ల క్రితం అసెంబ్లీలో సీఎం రంగసామి ప్రకటించారని, కానీ ఆ హామీ నేటివరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై ప్రశ్నిస్తుంటే స్పందించడం లేదన్నారు. ఎన్‌ఎమ్‌ఆర్‌లను పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ సదుపాయాలన్నీ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సల్లా శ్రీనివాసరావు, కర్రి నాగబాబు, ప్రవీణ్, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216పై యానాం బైపాస్‌లో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పటవల గ్రామానికి చెందిన పెన్నెట్టి వెంకటరమణ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు వెంకటరమణ ద్విచక్రవాహనంపై యానాం వెళ్లి తిరిగి పటవల వస్తుండగా, అమలాపురం నుంచి కాకినాడ వైపుకు వెళుతున్న వ్యాను వెనుకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు వెళ్లి క్షతగాత్రుడిని 108లో కాకినాడ తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన తప్పనిసరి

ఏడీఏ షంషి



సమాచార హక్కు చట్టంపై మాట్లాడుతున్న ఏడీఏ షంషి

అమలాపురం రూరల్: పారదర్శక పాలన అందించడంతోపాటు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని తీసుకువచ్చిందని, ఈ చట్టంపై అధికారులు, ఉద్యోగులు తప్పని సరిగా పూర్తి అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎంఏ షంషి సూచించారు. కామనగరువు రైతు సేవా కేంద్రంలో ఏవో ధర్మ ప్రసాద్ అధ్యక్షతన బుధవారం సమాచార హక్కు చట్టంపై మండల స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు, రైతులకు అవగాహన కల్పించారు. పౌరులు సమాచార హక్కు చట్టం ద్వారా ఏ వివరాలను అడిగినా ఇవ్వవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అందువల్ల సమాచార హక్కు చట్టంపై అందరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఇచ్చిన సమాచారం పక్కాగా ఉండాలని, లేకపోతే అర్జీదారుడు ఉన్నతాధికారులకు అప్పీలు చేస్తాడని వివరించారు. తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమాచారాన్ని నిర్ణీత సమయంలో అర్జీదారుడికి ఇవ్వాలని తెలిపారు. ఈ విషయాలపై గ్రామస్థాయి వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన కల్పించుకోవాలన్నారు. రైతులకు సమాచార హక్కు చట్టం గురించి వివరించారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

అమలాపురం రూరల్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు ప్రాంగణంలోని మండల లీగల్ సర్వీస్ కార్యాలయంలో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. వివిధ కోర్టుల్లో పెండింగ్ ఉన్న సివిల్ కేసులు, బ్యాంక్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడే క్రిమినల్ కేసులను పరిష్కరించనున్నట్టు తెలిపారు. కక్షి దారులు అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ లోక్ అదాలత్‌లో ఆయా కేసులను పరిష్కరించుకోవలసిందిగా రెండో అదనపు జిల్లా జడ్జి నరేష్ కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసులు అధికారులు, బ్యాంక్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొని ఎక్కువ కేసులు పరిష్కరించవలసిందిగా ఆయన కోరారు.

డిసెంబరులో మానవతా సంస్థ స్వర్ణోత్సవాలు



ప్రముఖులను సత్కరిస్తున్న రామకృష్ణారావు

అమలాపురం టౌన్: అమలాపురంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసెంబర్‌లో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్టు ఈ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది ముషిణి రామకృష్ణారావు తెలిపారు. స్థానిక సూర్యానగర్‌లో గల సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన స్వర్ణోత్సవ సన్నాహక సమావేశంలో రామకృష్ణారావు మాట్లాడారు. ఈ సందర్భంగా సమావేశానికి అతిథులుగా హాజరైన పలు రంగాల ప్రముఖులు, కళాకారులు మాండలీక నరసింహారావు, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, ములపర్తి సత్యనారాయణ, కరాటం ప్రవీణ్, కదలి సత్యనారాయణ తదితరులను సంస్థ తరఫున అధ్యక్షుడు రామకృష్ణారావు ఘనంగా సత్కరించారు.

శ్రీ పాద వల్లభుడికి అభిషేకం



అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి సన్నిధిలో శ్రీ పాదవల్లభుడికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. శోభాయాత్రలో భాగంగా పిఠాపురానికి చెందిన శ్రీపాద వల్లభుడు ప్రత్యేక రథం బుధవారం ఇక్కడకు చేరుకుంది. శ్రీపాదవల్లభునికి ఆలయ వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలో ప్రత్యేక ఆహ్వానం పలికారు. అనంతరం శ్రీపాదవల్లభుని విగ్రహాన్ని ఆలయంలో ఉంచి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

తక్కువ వేతనాలతో శ్రమదోపిడీ

నేషనల్ ఓఎన్‌జీసీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాబ్జి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు బాబ్జి

ఉప్పలగుప్తం: చమురు సంస్థల యాజమాన్యాలు తక్కువ వేతనాలతో పని చేయించుకుంటూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నాయని నేషనల్ ఓఎన్‌జీసీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాబ్జి తెలిపారు.
శ్రమకు తగిన వేతనాలు చెల్లించి న్యాయం చేయాలని కోరారు. నేషనల్ ఓఎన్‌జీసీ వర్కర్స్ యూనియన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల బాబ్జి అధ్యక్షతన బుధవారం యూనియన్ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ కార్మికులకు కనీస స్థాయిలో కూడా భద్రత కల్పించడం లేదన్నారు.బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పాలమూరి మోహన్ బాబు, లీగల్ అడ్వైజర్ కోలా త్రిమూర్తులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ కార్మికులకు తగిన వేతనాలు అందిస్తూ, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, యూనియన్ నాయకులు బడుగు సత్యనారాయణ, నామాడి ఆనంద్ కుమార్, జనుపెళ్ళ రవీంద్ర, మోకా దుర్గారావు అయితాబత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐ పోలవరం జెడ్పీ హైస్కూల్ సందర్శన



ఐ పోలవరం జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేస్తున్న మధుసూదనరావు

ఐ పోలవరం: ఐ పోలవరం జెడ్పీహైస్కూల్‌ను జిల్లా అడిషనల్ పీఎం శ్రీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మధుసూదనరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీఎం శ్రీ ప్రాజెక్టుకు సంబంధించి పలు విషయాలపై చర్చించి, గణితపాల్ లాబ్, విజిటబుల్ గార్డెన్, ఫ్లవర్ గార్డెన్, తరగతుల నిర్వహణ, టైమ్‌టేబుల్, క్రీడామైదానం పరిశీలించారు. అనంతరం స్కూల్‌కు సంబంధించి గ్రాంట్‌ల మంజూరు, ఖర్చుల వివరాలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పదార్థాలను పరిశీలించి, ఆహారనాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కొండారెడ్డి, తిరుమలరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.పాపారావు, స్టాఫ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, శాంతకుమార్, రాంబాబు, రమణమూర్తి, నారాయణరావు, రమ్య, సతీష్ పాల్గొన్నారు.

ఎంపీపీ దంపతులకు మల్లాడి పరామర్శ



చెన్నై ఎస్‌ఆర్‌ఎం ఆస్పత్రిలో ఎంపీపీ రాయుడు సునీత, గంగాధర్‌ను పరామర్శిస్తున్న మల్లాడి కృష్ణారావు

తాళ్లరేవు: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్య పరీక్షల కోసం చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం గ్లోబల్ ఆస్పత్రిలో చేరిన ఎంపీపీ రాయుడు సునీత భర్త రాయుడు గంగాధర్‌ను పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరామర్శించారు. బుధవారం ఆయన స్వయంగా ఆస్పత్రికి వెళ్లి ఎంపీపీ దంపతులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

ఇరుకు రోడ్డులో ట్యాంకర్ రాకపోకలతో అవస్థలు

కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించిన వర్తక సంఘాల ప్రతినిధులు



మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతి పత్రం అందిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్, బులియన్ అసోసియేషన్ వ్యాపార సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: మున్సిపల్ వాటర్ వర్క్స్ నుంచి ఓ వాటర్ ట్యాంకర్ స్థానిక బులియన్ మార్కెట్ ఇరుకు రోడ్డులో రోజుకు 20 ట్రిప్పుల వరకూ తిరగడం వల్ల ప్రజలు, వినియోగదారుల పలు అవస్థలకు గురవుతున్నారని చాంబర్ ఆఫ్ కామర్స్, బులియన్ అసోసియేషన్‌కు చెందిన పలు వర్తక సంఘాల ప్రతినిధులు కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజుకు తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజును బుధవారం కలిసి సమస్యను వివరించి, వినతి పత్రం అందజేశారు. ఇరుకు రోడ్డులో ట్యాంకర్ డ్రైవర్ పెద్ద శబ్దంతో హారన్ కొట్టడం వల్ల కస్టమర్లు మరింత అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. దీనికి తోడు ఇదే రోడ్డు మీదుగా రోజూ చేపల మార్కెట్ నుంచి కుళ్లిపోయిన చేపలు, రొయ్యలు, వాటి వ్యర్థాలతో వెళుతున్న వాహనాల వల్ల భరించలేని దుర్గంధం వెలువడుతుండడంతో ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు. కమిషనర్‌ను కలిసిన వారిలో చాంబర్ కార్యదర్శి కొమ్మూరి వెంకటచల ప్రసాద్, చాంబర్ సలహాదారులు చింతలపూడి సత్తిబాబు, రేకపల్లి సూరిబాబు, బులియన్ అసోసియేషన్ ప్రతినిధులు సందీప్, విజయ్, అనుపోజు శ్రీను, ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి తదితరులున్నారు.